సాక్షి పెద్దపల్లి

సోమవారం । 25 । డిసెంబర్ । 2023

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

జిల్లాలో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి దాటాక.. సోమవారం వేకువజామున పాస్టర్లు కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు శాంతిసందేశాలు ఇచ్చారు. పెద్దపల్లిలో జరిగిన వేడుకల చిత్రాలివి..

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





న్యూస్‌రీల్

వారబందీ పద్ధతిన సాగునీరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: నియోజకవర్గ పరిధిలోని రైతులకు ఇబ్బంది కలుగకుండా పంటలకు వారబందీ పద్ధతిన సాగునీరు అందించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఆదివారం ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు, ఎస్ఈ సత్యరాజ్‌చంద్రతో పాటు ఇతర అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. సాగునీటి సరఫరా, కాల్వల నిర్వహణ తదితర విషయాలపై చర్చించారు. నియోజకవర్గ వ్యవసాయ రంగానికి సాగునీటిని సరఫరా చేసే ఎస్సారెస్పీ డి–83, డి–86 కాలువల ద్వారా వారబందీ పద్ధతిన నీటిని విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే వారం రోజుల పాటే సాగు నీరు సరఫరా చేస్తే రైతులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున వారబందీకి బదులు కనీసం 12రోజులపాటు సాగునీరు సరఫరా చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మల్లన్నకు మొక్కులు



పట్నాలు వేయిస్తున్న భక్తులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల శ్రీమల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది తరలివచ్చి స్వామివారికి పట్నాలు వేసి, పూజలు చేశారు. బోనాలు తయారు చేసి నైవేద్యం సమర్పించారు. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



వినీల



విశాల్

ఎలిగేడు(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన అక్కాతమ్ముళ్లు తాటిపల్లి వినీల, తాటిపల్లి విశాల్ జాతీయస్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడులోని వేలూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి చదరంగం పోటీల్లో వారికి చోటు లభించింది. ఎస్‌జీఎఫ్ అండర్–19లో వినీల, అండర్–17లో విశాల్ తెలంగాణ రాష్ట్ర టీంలో ఆడనున్నారు. వీరిని వైస్ఎంపీపీ బుర్ర వీరస్వామిగౌడ్, ఉపాధ్యాయులు తదితరులు ఆదివారం అభినందించారు.

ఆదాయపు పన్ను రీయింబర్స్ చేయిస్తాం



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: రాబోయే ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపిస్తే ఆదాయపు పన్ను రీయింబర్స్‌మెంట్ చేయిస్తామని ఆ యూనియన్ జాతీయ నాయకుడు, వేజ్‌బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ కృషితోనే బొగ్గుగని కార్మికుల వేతన ఒప్పందం మెరుగ్గా జరిగిందన్నారు. ఈప్రాంతంలో కొత్త గనులను ప్రారంభించేలా చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్మిక కుటుంబాలకు మంచినీటి సౌకర్యం కల్పిస్తామని సమస్యలకు పరిష్కారం చూపిస్తామని పేర్కొన్నారు. ఆరుసార్లు గుర్తింపు యూనియన్‌గా గెలిచిన యూనియన్లు కార్మికులకు ఏమీ చేయలేకపోయాయని విమర్శించారు. తమకు ఒక్కసారి అవకాశం ఇస్తే కార్మికుల హక్కుల సాధనలో అలుపెరగని పోరాటం చేస్తామని, గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాగడా గుర్తుపై ఓటు వేసి బీఎంఎస్‌ను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు యాదగిరి సత్తయ్య, పులి రాజారెడ్డి, మండ రమాకాంత్, సారంగపాణి, హరీశ్, సతీశ్, లక్ష్మయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం చేరని కొనుగోళ్లు

- ధాన్యం కొన్నది తక్కువే..!
- కేంద్రాల్లో విక్రయానికి రైతుల విముఖం
- కల్లాల్లోనే కొనుగోలు చేసిన వ్యాపారులు
- చివరి దశకు చేరిన ధాన్యం సేకరణ



పెద్దపల్లి శివారులో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

సాక్షి, పెద్దపల్లి: ఏటా అన్నదాతల ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోల నడుమ ధాన్యం సేకరణ జరిగేది. ఈ వానాకాలం సీజన్‌లో ఎలాంటి అవరోధాలకు తావులేకుండా కొనుగోళ్లు సాగాయి. ఇందుకు ప్రధానకారణం పొలాల వద్దకు వచ్చి కల్లాల్లో కాంటాలు పెట్టి రైతులకు శ్రమలేకుండా ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేయడమే అని అధికారులు, రైతులు పేర్కొంటున్నారు. దీంతోపాటు ఎన్నికల విధుల నుంచి పౌర సరఫరాల శాఖ అధికారులను తప్పించి పూర్తిగా ధాన్యం సేకరణ కోసమే నియమించారు. ప్రారంభోత్సవాల పేరిట నేతల పర్యటనలు, హడావుడి లేకపోవడం కొనుగోళ్లు సజావుగా సాగడమని అంటున్నారు. ఇటీవల తుపాన్ ప్రభావం చూపడంతో ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర కన్నా రూ.100, రూ.200 తక్కువ ధరకైనా ప్రైవేట్ వ్యాపారులకే విక్రయిస్తే వర్షంతో నష్టం రాదని అన్నదాతలు వారి వైపే మొగ్గుచూపారు. ఫలితంగా ప్రభుత్వం ఈ సీజన్‌లో నిర్దేశిత లక్ష్యంలో 38శాతమే ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు చేయాల్సి వచ్చింది.

సీఎంఆర్ భర్తీ కోసమేనా..!?

- జిల్లాలో రైస్ మిల్లర్లకు అప్పగించిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఇవ్వకుండా, తమకు కేటాయించిన ధాన్యాన్ని పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి.
- ఈనేపథ్యంలో ఆ ధాన్యాన్ని భర్తీ చేయడానికే రైస్‌మిల్లర్లు నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- జిల్లాలో వానాకాలం(2022–23) ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు డెలివరీ చేసిన సీఎంఆర్ 51శాతం ఉండగా, యాసంగి (2022–23)కు సంబంధించి 21శాతం సీఎంఆర్‌ను మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించారు.

తేమశాతంతో పనిలేదు

ప్రభుత్వం క్వింటాలు ఏ– గ్రేడ్ ధాన్యానికి రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040 చొప్పున మద్దతు ధర చెల్లిస్తోంది. తేమ 17శాతం ఉండటంతో పాటు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న వడ్లనే మిల్లర్లు సేకరిస్తున్నారు. దీనికి తోడు 40కిలోల సంచికి కిలోన్నర మేర తరుగు ఇవ్వాలి. అలాగే రవాణా చార్జీలతో ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాల్సి ఉంది. అయితే వ్యాపారులు తేమతో పనిలేకుండా క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధరతోనే పంట కల్లాల వద్దనే కొనుగోలు చేస్తున్నారు. హమాలీతోపాటు ఇతరత్రా ఖర్చులన్నింటినీ వారే భరిస్తుండటంతో రైతులకు ఆర్థికంగా కలిసి వస్తోంది.

సన్నాలకు ఫుల్ డిమాండ్

ప్రైవేట్ వ్యాపారులకు తోడు చాలామంది నేరుగా రైతుల వద్ద సన్నరకం వడ్లను కొనుగోలు చేసి మరఆడించి బియ్యంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వ కేంద్రాలతో పోలిస్తే బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుండటంతో రైతులు అటువైపే మొగ్గ చూపుతున్నారు.

ధాన్యం కొనుగోలు సమాచారం

కొనుగోలు కేంద్రాలు	307
సేకరణ లక్ష్యం(లక్షల మెట్రిక్ టన్నుల్లో)	4.31
సేకరించింది(మెట్రిక్ టన్నుల్లో)	1,66,486
విక్రయించిన రైతులు	29,497
కేంద్రాల్లో నిల్వఉన్నవి (మెట్రిక్ టన్నుల్లో)	321.36
సొమ్ము జమైన రైతులు	25,651
ధాన్యం విలువ(రూ.కోట్లలో)	306.58

ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు

ప్రస్తుత సీజన్‌లో అన్నదాతలకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరిస్తున్నాం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ప్రతీధాన్యపుగింజ కొనుగోలు చేస్తున్నాం. ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధరకే రైతుల నుంచి సేకరిస్తున్నారు. దీంతో వారు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రావడంలేదు. కొనుగోళ్లు తుదిదశకు చేరుకున్నాయి. ట్యాబ్ ఎంట్రీ వేగంగా పూర్తవుతోంది. ధాన్యం విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతోంది.

- ప్రేమ్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి



సీఎంతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

సీఎం దృష్టికి జిల్లా సమాచారం

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్‌లో ఆదివారం జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. జిల్లానుంచి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి హాజరయ్యారు. జిల్లాకు సంబంధించిన సంపూర్ణ సమాచారాన్ని వారు ప్రభుత్వానికి నివేదించారు.



అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, సీపీ రెమారాజేశ్వరి

ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో ఎన్నికలు

- 11 ఏరియాలు.. 84 పోలింగ్ కేంద్రాలు
- 27న ఎన్నికలు, అదేరోజు ఓట్ల లెక్కింపు
- పలు రాష్ట్రాల నుంచి 13 మంది ఏఆర్‌వోల రాక
- పూర్తిస్థాయి పోలీసు భద్రత మధ్య ఎన్నికలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డిప్యూటీ సీఎల్‌సీ శ్రీనివాసులు

గోదావరిఖని: సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు ఈనెల 27న నిర్వహించేందుకు అధికారులు సర్వసన్నద్ధమయ్యారు. డిప్యూటీ సీఎల్‌సీ శ్రీనివాసులు నేతృత్వంలో పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 39,749మంది కార్మికులు (ఓటర్లు) ఉన్నారు. 13 యూనియన్లు పోటీ పడుతున్నాయి. ఈనెల 27 ఎన్నికలు నిర్వహించి అదేరోజు లెక్కింపు చేపడతారు. కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామని, పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని డిప్యూటీ సీఎల్‌సీ శ్రీనివాసులు వెల్లడించారు. 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ వివరాలు..





సాక్షి: ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

శ్రీనివాసులు: సింగరేణిలోని 11 ఏరియాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం. కేరళ, ఒడిశా, కర్ణాటక, ఢిల్లీ నుంచి కార్మికశాఖకు చెందిన 13 మంది అధికారులను అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియమించాం. వారి సారథ్యంలోనే ఓట్ల లెక్కింపు చేపడతాం.

సాక్షి: ఎంతమంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తున్నారు?

శ్రీనివాసులు: మొత్తం 84 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. 700 మంది సిబ్బంది సేవలు వినియోగిస్తున్నాం. రెవెన్యూ విభాగం సిబ్బంది సేవలూ వినియోగిస్తాం.

సాక్షి: పర్యవేక్షణ కోసం ఎంతమందిని నియమించారు?

శ్రీనివాసులు: రామగుండం, బెల్లంపల్లి రీజియన్లకు చీఫ్ కో ఆర్డినేటర్‌గా ఎస్.సంపత్‌కుమార్, కొత్తగూడెం రీజియన్‌కు చీఫ్ కో ఆర్డినేటర్‌గా ఎస్‌కే సాహును నియమించాం.

సాక్షి: ఏయే ఏరియాల్లో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి?

శ్రీనివాసులు: మొత్తం 11 ఏరియాల్లో 84 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కార్పొరేట్‌లో 5, కొత్తగూడెంలో 6, ఇల్లెందులో 3, మణుగూరులో 7, ఆర్జీ–1లో 11, ఆర్జీ–2లో 6, ఆర్జీ–3లో 6, భూపాల్‌పల్లిలో 9, బెల్లంపల్లిలో 5, మందమర్రిలో 11, శ్రీరాంపూర్‌లో 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం.

సాక్షి: బందోబస్తుకు ఎంతమంది పోలీసులను వినియోగిస్తున్నారు?

శ్రీనివాసులు: అవసరమైన పోలీసు సిబ్బంది, అధికారుల నియామకంపై కసరత్తు చేస్తున్నాం. ఎన్నికల సిబ్బంది ఈనెల 26న ఉదయమే రిపోర్ట్ చేయాలి. అదేరోజు మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారు.

సాక్షి: సింగరేణి యాజమాన్యం ఎలాంటి పాత్ర పోషిస్తుంది?

శ్రీనివాసులు: ఏరియాల వారీగా జీఎంలు, పోలింగ్ కేంద్రాల వారీగా పర్సనల్ అధికారులు ఎన్నికల అధికారులు, సిబ్బందికి భోజన సదుపాయాలు కల్పిస్తారు.

సాక్షి: కౌంటింగ్ కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేశారు?

శ్రీనివాసులు: ఏరియాల వారీగా కౌంటింగ్ కేంద్రాలు ఉంటాయి. వేర్వేరుగా లెక్కింపు నిర్వహిస్తాం. ముందుగా బాలెట్ పేపర్లు లెక్కిస్తాం. ఆ తర్వాత ఓట్ల కౌంటింగ్ ప్రారంభమవుతుంది. రామగుండం రీజియన్‌లో మూడు కేంద్రాలు ఒకేచోట ఉంటాయి. మిగతా ఏరియాల్లో వేర్వేరుగా ఉంటాయి.

సాక్షి: ఎన్నేళ్ల ప్రాతిపదికన ఎన్నికలు జరుగుతున్నాయి?

శ్రీనివాసులు: 2019లో జరగాల్సిన గుర్తింపు ఎన్నికలు ఆలస్యమయ్యాయి. కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌లో పొందుపర్చిన అంశాల ప్రకారం గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి ఉంటుంది.

చిగురిస్తున్న ఆశలు

- కొత్త రేషన్‌కార్డుల జారీకి గ్రీన్‌సిగ్నల్!
- జిల్లాలో 28 నుంచి దరఖాస్తుల స్వీకరణకు అవకాశం!



సుల్తానాబాద్(పెద్దపల్లి): గత ప్రభుత్వం కొత్తరేషన్ కార్డులు జారీచేయలేదు. ఉన్నకార్డుల్లో పేర్ల నమోదుకూ అవకాశం ఇవ్వలేదు. మార్పులు, చేర్పులతోపాటు కొత్తగా గతంల దరఖాస్తు చేసుకున్న వారికి ఎదురుచూపులే మిగిలాయి. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో పేదలు కొత్త రేషన్‌కార్డులపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఈనెల 28 నుంచి పట్టణాలు, గ్రామాల్లో దరఖాస్తు స్వీకరిస్తారని ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారనే సమాచారంతో అర్హులైన పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 2,10,147 తెల్లరేషన్, 175 అన్నపూర్ణ, 12,297 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. వాటిల్లో మార్పులు, చేర్పుల కోసం 11,644 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఉచిత రేషన్‌కు దూరం

ఆహార భద్రత కార్డులో పేరున్న సభ్యుడికి ప్రతినెలా 6 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ కొనసాగుతోంది. ఇదివరకు రూపాయికి కిలో బియ్యం ఇవ్వగా కోవిడ్ ప్రభావంతో మూడేళ్లుగా ఉచితంగానే అందిస్తున్నారు. అయితే, కొత్తరేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో పిల్లల పేర్లు చేర్చుకునేందుకు అవకాశం లేక వేలాది మంది ఉచిత బియ్యానికి దూరమవుతున్నారు.

అనర్హులను తొలగిస్తారా?

జిల్లాలో అత్యధిక మంది అనర్హులకు తెల్లరేషన్ కార్డులు ఉన్నట్లు గతంలో అధికారులు ప్రకటించారు. వ్యాపారులతోపాటు పారిశ్రామికవేత్తలు, ఉన్నత ఉద్యోగులు కూడా తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్నట్లు గుర్తించారు. ఐటీ చెల్లింపుదారులు, కారు, సొంతిల్లు ఉన్నవారికి తెల్ల రేషన్‌కార్డులు జారీ చేయొద్దని నిబంధనలు విధించడం పక్కాగా అమలుచేస్తే అర్హులకు న్యాయం జరుగుతుందని అర్హులు భావిస్తున్నారు.

అవకాశం మంచిదే



ప్రభుత్వం కొత్తకార్డులు ఇవ్వడంతోపాటు పాత వాటిలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలి. పాత వాటిని రద్దు చేసి కొత్త వాటిని ఇచ్చినా మంచిదే. అర్హులకు తెల్లరేషన్ కార్డులు ఉంటే అన్ని స్కీములకు అర్హులవుతారు.

- తంగళ్లపల్లి రాజ్‌కుమార్, బీసీ నేత

ఉత్తర్వులు అందాల్సి ఉంది



ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే కొత్తరేషన్ కార్డుల పంపిణీ, పాతవాటిలో మార్పులు, చేర్పుల గురించి ఆలోచిస్తాం. నిబంధనల మేరకు గ్రామ సభలు నిర్వహిస్తాం. ఇప్పటికే అందిన దరఖాస్తులపైఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం.

- శ్యామ్‌ప్రసాద్‌లాల్, అదనపు కలెక్టర్


లంచగొండితనం రూపుమాపుతాం

- సీఐటీయూ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు ఎన్.భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

జ్యోతినగర్(రామగుండం): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భిక్షపతి, కోశాధికారి రామాచారి కోరారు. ఆదివారం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలోని యూనియన్ కార్యాలయంలో ఈదునూరి భూమయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో మార్పు రావాలి–సీఐటీయూ గెలవాలనే నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. సొంతింటి కల, పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ రీయింబర్స్‌మెంట్, సింగరేణిలో అవినీతి, లంచగొండితనం రూపుమాపడం లక్ష్యమని అన్నారు. లంచాలు లేకుండా ఉద్యోగుల అన్‌ఫిట్, ఉద్యోగ నియామకాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అవినీతితో భ్రష్టు పట్టిన ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్, బీఎంఎస్‌లను వ్యతిరేకించాలని కోరారు. సమస్యలపై సమరశీల పోరాటాలు చేసే సీఐటీయూలో కార్మికులు చేరుతున్నారని తెలిపారు. యువ కార్మికుల నుంచి మంచి స్పందన ఉందన్నారు. సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఉదయించే సూర్యుని గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి, కో కన్వీనర్ తుంగపిండి మల్లేశ్, ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు భూమయ్య, ఈదునూరి రాజేశ్వర్, సభ్యులు అక్కపాక శంకర్, రవీందర్, సంపత్ పాల్గొన్నారు.



కన్నులపండువగా మహాపడిపూజ

సుల్తానాబాద్(పెద్దపల్లి): నీరుకుల్ల రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మహాపడిపూజ కన్నుల పండువగా నిర్వహించారు. గురుస్వామి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో తొలుత భక్తులు నగర సంకీర్తన చేశారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్తులు, మాలలు ధరించిన స్వాములు పాల్గొన్నారు.

అంతుచిక్కని కార్మికుడి నాడీ

- అన్ని యూనియన్ల మాటలు విని.. హామీలకు జైకొడుతున్న శ్రామికులు
- ఏరియాల వారీగా అంచనాల్లో కార్మిక సంఘాల నాయకులు

గోదావరిఖని: మరోరెండు రోజుల్లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగనున్నాయి. అన్ని గనులపై ఎన్నికల ప్రచారం మరింత వేడెక్కింది. అన్ని యూనియన్లు ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. ఐదు జాతీయ కార్మిక సంఘాలు, విప్లవ కార్మిక సంఘాలు ముందు వరుసలో ఉండగా.. గత గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ కాస్త వెనకంజలో ఉంది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘానికి కలిపి ఒకేఓటు పద్ధతిన ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఏరియాలో అత్యధిక ఓట్లు సాధించిన సంఘాన్ని ప్రాతినిధ్య, సింగరేణి వ్యాప్తంగా అత్యధిక ఓట్లు వచ్చిన యూనియన్‌ను గుర్తింపు కార్మిక సంఘంగా కార్మిక శాఖ గుర్తిస్తుంది.

నేటితో ప్రచారం సమాప్తం..

- సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారం ఈనెల 25వ తేదీ(సోమవారం)తో ముగియనుంది.
- ఈక్రమంలో గనులు, డిపార్ట్‌మెంట్లపై కార్మిక సంఘాలు ప్రచారం ముమ్మరం చేశాయి.
- గనులపై గేట్ మీటింగ్‌ల కోసం అన్ని యూనియన్లు పోటీ పడుతున్నాయి.
- హైకోర్టులో కేసు కొనసాగడం, ఎన్నికల నిర్వహణ సజావుగా సాగుతుందా? లేదా వాయిదా పడుతుందా? అనే మీమాంస కొనసాగిన క్రమంలో ఎన్నికలు నిర్వహించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది.
- దీంతో పోలింగ్‌కు ఉన్న తక్కువ సమయంలో ఎక్కువ ప్రచారం నిర్వహించాలాయ యూనియన్లు గనులు, డిపార్ట్‌మంట్లపై గేట్ మీటింగులకు పోటీ పడుతున్నాయి.

కార్మికుల ఓట్లు ఎటువైపు..

కార్మికుల ఓట్లు ఎటువైపైనా అన్ని యూనియన్ల గేట్ మీటింగ్‌లను ఆసక్తిగా వింటున్నారు. ప్రతీరోజు రెండు షిఫ్టుల్లో గేట్ మీటింగ్‌లు కొనసాగుతుండగా సుమారు గంటపాటు ఒక్కో గేట్ మీటింగ్ కొనసాగుతోంది. కార్మికులు ఓపికగా యూనియన్ నేతల మాటలు ఆలకిస్తున్నారు. అన్నియూనియన్ల హామీలు సావధానంగా వింటూ తమ అంతరంగాన్ని మాత్రం బహిర్గత పర్చడం లేదు. రాజకీయ ఓటింగ్‌కు, సింగరేణి గుర్తింపు ఎన్నికలకు ఎంతో వ్యత్యాసం కనిపిస్తోంది. తమ భవిష్యత్‌ను నిర్ణయించే ఓట్ల విషయంలో కార్మికులు ఆచీతూచి వ్యవహరిస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఎన్నికల ప్రక్రియ చివరి దశకు చేరుతుండడంతో అన్నివర్గాల్లో ఆసక్తి పెరిగింది.



క్లుప్తంగా

అదుపుతప్పి లారీ బోల్తా



బోల్తా పడ్డ లారీ

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో ఆదివారం యాష్‌లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఎన్టీపీసీ నుంచి యాష్ లోడ్‌తో బేగంపేట వైపు వెళ్లే క్రమంలో హఠాత్తుగా ఆటో అడ్డు రావడంతో అదుపుతప్పిన లారీ బోల్తా పడింది. ఈప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమా దం జరగలేదు. దీంతో ఊపిరి పీల్చుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మీర్జంపేట గ్రామ పంచాయతీ పరిధి పోచంపల్లి గ్రామానికి చెందిన కొప్పుల కృపాకర్(31) ఈనెల 22న పురుగుల మందు తాగినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. కృపాకర్ కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో మనస్తాపానికిగురై పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు మృతుడి భార్య లలిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్– 14 బేస్‌బాల్ పోటీల్లో అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన పలువురు బాలబాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన ఎస్జీఎఫ్ పోటీల్లో బాలికల విభాగంలో బిరుదు మనస్వి, వైసిక, ప్రణవి, ప్రియాన్షు, సహస్రశ్రీ, బాలుర విభాగంలో వినిష్‌రావు, శశిధర్, భరద్వాజ్, కృష్ణ చైతన్య రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లా తొర్రూర్‌లో ఆదివారం నుంచి నిర్వహిస్తున్న పోటీల్లో వారు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా క్రీడాకారులను అభినందించారు.

అదృశ్యం కేసు నమోదు



వినోద్‌కుమార్(ఫైల్)

జమ్మికుంట: పట్టణంలో ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రమేశ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా నందికొట్కూర్ గ్రామానికి చెందిన పోతుల వినోద్‌కుమార్ అత్తగారి ఊరు జమ్మికుంట మున్సిపల్ పరిధి ధర్మారంలో నివసిస్తున్నాడు. ఈ నెల 20న ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదని, బంధువులను సంప్రదించినా ఆచూకీ లభించకపోవడంతో భార్య పోతుల అరుణ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

తాళమేసిన ఇంట్లో చోరీ


సారంగాపూర్: లచ్చక్కపేటకు చెందిన గాజర్ల నివేద ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. నివేద తన తండ్రి అనారోగ్యానికి గురికావడంతో ఈనెల 22న ఇంటికి తాళంవేసి వెళ్లింది. దీనిని ఆసరాగా చేసుకున్న దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలో భద్రపర్చిన ముప్పావు తులం బంగారం, 33తులాల వెండి, రూ.27వేలు ఎత్తుకెళ్లారు. ఇంటి పక్కవారు ఆదివారం ఉదయం గమనించి నివేదకు సమాచారం అందించారు. ఆమె చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వెంకటయ్య తెలిపారు.

విద్యుత్ కాంతులు.. అదిరే నక్షత్రాలు

- ముస్తాబైన చర్చిలు
- సుందరంగా నివాసాలు
- ఆకట్టుకునే పశువుల పాకలు
- కళ్లు మిరమిట్లు గొలిపే క్రిస్మస్‌ట్రీలు
- ఉత్సవాలకు సన్నద్ధమైన జిల్లావాసులు
- నేడు క్రిస్మస్ వేడుకలు



గోదావరిఖని సాక్రెడ్ హార్ట్ చర్చిలో రిహాల్సల్స్ చేస్తున్న కళాకారులు



ఆకట్టుకుంటున్న పశువుల పాక



పెద్దపల్లిలో..





గోదావరిఖనిలో ఆకట్టుకుంటున్న క్రిస్మస్ స్టార్స్, శాంటాక్లాజ్, గృహోపకరణాలు

పెద్దపల్లిరూరల్/కోల్‌సిటీ/ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): లోక రక్షకుడు క్రీస్తు. ఆయన త్యాగం తరతరాలకూ శాంతిసందేశం. తలకు ముళ్లకిరీటం పెట్టి బాధించినా.. శిలువ వేసి శిక్షించినా.. అందుకు బాధ్యులైన వారిని కూడా దయతో మన్నించాడు ఏసుక్రీస్తు. 'శరీరం నెత్తురోడినా.. శాంతి, సహనం వీడరాదు.. చివరకు అవే జయిస్తాయి' అంటూ తన జీవిత సందేశంతో లోకానికి చాటిచెప్పిన లోకరక్షకుడు ఏసుప్రభువు. ప్రపంచంలోని క్రైస్తవులు సంతోషంగా జరుపుకునే సంబురం క్రిస్మస్ వేడుక. సోమవారం కరుణామయుడు పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక కథనం..

ముస్తాబైన చర్చిలు..

- జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు.
- వేడుకలకు రామగుండం నగరపాలక సంస్థతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల పరిధిలోని చర్చిలను క్రైస్తవులు ముస్తాబు చేశారు.
- పాస్టర్లు, క్రైస్తవ సంఘాలు ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తిచేసుకున్నారు.
- క్రైస్తవ కుటుంబాల్లో సందడి నెలకొంది. ఇళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించుకున్నారు.
- ఆయా చర్చిలను నిర్వాహకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.
- విద్యుత్ కాంతులతో అలంకరించారు.
- ఆదివారం అర్ధరాత్రి, సోమవారం వేకువజాము నుంచి ప్రార్థనలు ప్రారంభించారు.
- క్రైస్తవులు ప్రార్థనలు చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
- చర్చిల్లో అతిథులకు స్వాగతం పలుకడం, ఏసు క్రీస్తు జననం, శాంతి సందేశంతో కూడిన గీతాలు ఆలపించడానికి కళాకారులు 15 రోజులుగా కసరత్తు చేస్తున్నారు.

పశువుల పాక, క్రిస్మస్ ట్రీలు, స్టార్..

క్రిస్మస్‌ను పురస్కరించుకొని క్రైవస్తువులు తమ గృహాలను, చర్చిలను శాంటాక్లాజ్, క్రిస్మస్ ట్రీ, పశువుల పాక, స్టార్‌లతో ముస్తాబు చేసుకున్నారు. ఏసుక్రీస్తు జన్మదినానికి గుర్తుగా ఈ ఏర్పాట్లు చేస్తే ఇంటిల్లిపాదికి ఆశీర్వాదాలు, దీవెనలు, సిరిసంపదలు అందుతాయని క్రైస్తవుల విశ్వాసం.

సందడిగా షాపింగ్..

జిల్లాలోని వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, బేకరీలు సందడిగా మారాయి. కస్టమర్లను ఆకట్టుకునేలా శాంటాక్లాజ్, క్రిస్మస్ ట్రీస్, అలంకరణ తోరణాలు, శాంటాక్లాజ్ డ్రెస్‌లు, క్యాప్‌లు, బెల్స్, హ్యాంగింగ్స్, బెలూన్స్, కలర్ బాల్స్, ఎల్‌ఈడీ బల్బ్‌లు, ఏసుక్రీస్తు బొమ్మలు, పశువుల పాక, ఇంట్లో, బయట సులువుగా డెకోరేషన్ చేసుకునేలా ఆకట్టుకునే రకరాల వస్తువులు అందుబాటులో ఉంచారు. శాంటాక్లాజ్ డ్రెసెస్, క్యాప్స్, క్రిస్మస్ ట్రీస్, స్టార్స్ ఎక్కువగా అమ్ముడవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. కస్టమర్లను ఆకట్టుకునేలా బేకరీల్లో ప్రత్యేక క్రిస్మస్ కేకలను తయారు చేశారు.





విద్యుత్ వెలుగుల్లో రంగంపల్లిలోని చర్చి, గోదావరిఖనిలోని సాక్రెడ్ హార్ట్ చర్చి



చర్చి ఎదుట వెలుగులు



ఆకట్టుకునే ఆకృతులు



వేడుకలకు ముస్తాబైన ఎఫ్‌సీఐలోని గ్లోరియస్ మినిస్ట్రీస్ చర్చి



పెద్దపల్లిలోని సీఎస్ఐ చర్చిలో ఏర్పాట్లు



అమ్మవారికి కుంకుమపూజ నిర్వహిస్తున్న భక్తులు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

హరహర మహాదేవ

వేములవాడ: వరుస సెలవులు రావడంతో రాజన్న దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఆదివారం దాదాపు 35వేల మంది దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు రాజన్నను దర్శించుకున్నారు. రాజన్న సన్నిధిలో కొనసాగుతున్న గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు ఏర్పాట్లను పరిశీలించారు.



రాజన్న సన్నిధిలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు

బొగ్గు బాయి వార్తలు

హామీలన్నీ నెరవేరుస్తాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు యూసుఫ్



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: రాబోయే ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపిస్తే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని పూర్తిగా అరికడతామని, హక్కుల సాధనలో ముందంజలో ఉంటామన్నారు. సంస్థ పరిరక్షణ కోసం, కార్మికుల సమస్యల పరిష్కారంలో అగ్రభాగాన నిలుస్తామని అన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించారు. రాజకీయ జోక్యం ఉన్న సంఘాలను గెలిపిస్తే కార్మికులకు న్యాయం జరగదని తెలిపారు. కార్మికుల హక్కుల సాధనలో వెన్నంటి ఉన్న తమ యూనియన్ చుక్క గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కె.స్వామి, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల ఘనత మాదే..

- టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య



మాట్లాడున్న నాయకులు

గోదావరిఖని: కోలిండియాలో లేనివిధంగా సింగరేణిలో కారుణ్య నియామకాలు కల్పించిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని ఆ పార్టీ అనుబంధ టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య అన్నారు. శనివారం జీడీకే–5 ఓసీపీపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం బొగ్గు బ్లాకులు ప్రైవేట్‌పరం కాకుండా అప్పటి సీఎం కేసీఆర్ చూశారన్నారు. కారుణ్య నియామకాల ద్వారా 19,463 మంది యువత కొత్తగా ఉద్యోగాలు సాధించారన్నారు. సొంతింటి నిర్మాణం కోసం రూ.10లక్షలు వడ్డీలేని రుణం ఇప్పించారని పేర్కొన్నారు. అలాగే కార్మికుల క్వార్టర్లకు ఏసీ సౌకర్యం, ఉచిత విద్యుత్, బదిలీ వర్కర్ల పర్మినెంట్.. ఇలా అనేక హక్కులు సాధించామని అన్నారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో బాణం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గండ్ర దామోదర్‌రావు, దేవ వెంకటేశం, వడ్డేపల్లి శంకర్, జాహీద్‌పాషా, పర్లపల్లి రవి, వెంకటేశ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నృసింహాలయంలో బంగారు గొలుసు మాయం

- వెతికిచ్చిన ఆలయ సిబ్బంది



బంగారు గొలుసును అప్పజెప్పుతున్న తిరుపతి

ధర్మపురి: దైవదర్శనానికి వచ్చిన ఓ భక్తురాలు తన మెడలోని బంగారు గొలుసును ఆలయంలో పోగొట్టుకుంది. ఆలయ సిబ్బంది వెదికి అప్పగించారు. ఆలయ సిబ్బంది కథనం ప్రకారం.. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం స్వామివారికి అభిషేకం జరుగుతుండగా ప్రధాన ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాసరెడ్డి తన భార్యాపిల్లలతో కలిసి దైవదర్శనానికి వచ్చి అభిషేకంలో పాల్గొన్నారు. ఆ సమయంలో శ్రీనివాసరెడ్డి కూతురు మెడలోని బంగారు గొలుసు పడిపోయింది. కొద్దిసేపటికి చూసుకున్న వారు వెంటనే ఆలయ సిబ్బందికి తెలిపారు. అయితే అక్కడ విధులు నిర్వర్తిస్తున్న తాత్కాలిక ఉద్యోగి మాదాసు తిరుపతి అభిషేకం టికెట్ల అమ్మకాల ఆధారంగా ఆలయంలోకి ఎవరెవరు వచ్చారు అని తెలుసుకుని సదరు భక్తులను ఆశ్రయించాడు. ఆ భక్తులు కూడా తమకు గొలుసు దొరికిందని తిరుపతికి ఇచ్చారు. బంగారు గొలుసును ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో డాక్టర్ దంపతులకు అందించారు.

కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేస్తాం

- ఏఐటీయూసీ నాయకుడు యూసఫ్ పాషా



మాట్లాడుతున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తమ యూనియన్ గెలిస్తే కొత్త బొగ్గు గనుల ఏర్పాటుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్ పాషా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం స్థానిక కాలనీప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిని ప్రైవేటీకరణ కాకుండా పోరాటం చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కొత్త గనులు తవ్విస్తామని అన్నారు. ఉద్యోగుల పిల్లలకు కార్పొరేట్‌స్థాయి విద్య, వైద్యం ఉచితంగా అందించేలా చూస్తామని పేర్కొన్నారు. కార్మికుల సొంతింటికల నెరవేరుస్తామని తెలిపారు. ఈనెల 27న నిర్వహించనున్న ఎన్నికల్లో ఏఐటీయూసీ నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, వైవీ రావు, రాజారత్నం, ప్రకాశ్, రవీందర్, రాంచందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

- ఇద్దరి పరిస్థితి విషమం
- సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలింపు



ఎల్లారెడ్డిపేటలో మారుతికి చికిత్స చేస్తున్న వైద్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రం శివారులో ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొన్న ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వీరిని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన ఊరేం మారుతి మండలంలోని రాచర్లగొల్లపల్లిలో ఉంటున్న తన బావ నవీన్ ఇంట్లో పుట్టిన రోజు వేడుకలకు వచ్చాడు. మారుతి తన బంధువు ప్రత్యూషతో కలిసి సిరిసిల్ల లో బట్టలు, కేక్ కొనుగోలు చేసుకొని తిరిగి వస్తుండగా.. శ్రీచైతన్య పాఠశాల వద్ద ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్లకు వెళ్తున్న ఆటో ఎదురుగా రావడంతో రెండు వాహనాలు ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో మారుతి, ప్రత్యూషతోపాటు సిరిసిల్ల మండలం రగుడుకు చెందిన ఆటోడ్రైవర్ ఎండీ రజాక్, మరో ముగ్గురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై, సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ద్విచక్ర వాహనదారులను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి, ఆటోలో గాయపడి పరిస్థితి విషమంగా ఉన్న వారిని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మానసిక వేదనతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని జ్యోతినగర్‌కు చెందిన గంకిడి రాము అలియాస్ రాంరెడ్డి(52) గతంలో మెడికల్ షాప్‌లో పని చేసి మానేశాడు. రెండేళ్ల నుంచి ఇంటి వద్దే ఖాళీగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగకుండా ఉండేందుకు కుటుంబసభ్యులు మూడునెలలు హైదరాబాద్‌లో చికిత్స ఇప్పించారు. తిరిగి ఇంటికి వచ్చిన కొన్ని రోజుల బాగానే ఉన్న రాంరెడ్డి మళ్లీ మద్యం తాగేందుకు ప్రయత్నాలు చేశాడు. కుటుంబసభ్యులు మద్యం తాగవద్దని వారించడంతో తీవ్ర మానసిక వేదనకు గురి అయ్యాడు. ఈ క్రమంలోనే ఆదివారం వేకువజామున తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వార్ వన్‌సైడే..



మాట్లాడుతున్న నాయకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): కార్మిక సంఘం ఎన్నికల్లో వార్ వన్ సైడ్‌గానే కార్మికులు సిద్ధమయ్యారని ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ బాల్‌రాజు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధన, శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేసేది ఏఐటీయూసీ ఒక్కటే అన్నారు. కొత్త బొగ్గు గనుల అన్వేషణ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే సంఘానికి కార్మికులు అండగా నిలవాలని కోరారు. కొన్ని సంఘాలు కార్మికులను ప్రలోభాలకు గురిచేసి ఓట్లను రాబట్టుకునేందుకు చూస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని అన్నారు. నాయకులు నరసింహ, కదారి సునీల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్థమైతే గణితమే సులువు



మెమెంటో అందిస్తున్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్‌: అర్థమైతే గణితమే సులువుగా ఉంటుందని అల్ఫోర్స్‌ విద్యా సంస్థల అధినేత నరేందర్‌ రెడ్డి అన్నారు. నేషనల్‌ మ్యాథమెటిక్స్‌డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలువురు విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. సుల్తానాబాద్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌ బాయ్స్‌ పాఠశాలలోని 7వ తరగతి విద్యార్థి రక్షిత్‌కు మొదటి బహుమతి, రూ.5వేల నగదు అందించినట్లు వివరించారు.

అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఆదివారం మీల్స్‌ ఆన్‌వీల్స్‌ కార్యక్రమంలో భాగంగా అల్పాహారం పంపిణీ చేశారు. క్లబ్‌ రీజియన్‌ సిక్స్‌ రీజియన్‌ చైర్‌పర్సన్‌ అశోక్‌కుమార్‌ జన్మదినం సందర్భంగా పెద్దపల్లితో పాటు రామగుండం ఆసుపత్రిలో అల్పాహారం అందించారు. సభ్యులు బాబురావు, జైపాల్‌రెడ్డి, సంపత్‌రావు, శశాంక్‌, అనిల్‌చారి, భిక్షపతి, వెంకటేశ్‌, అతీఫ్‌, శ్రీనివాస్‌, భాస్కర్‌రావు, ఆనంద్‌, కుమార్‌ పాల్గొన్నారు.

సరుకులు అందజేత



సరుకులు పంపిణీ చేస్తున్న కుమార్‌

మంథని: క్రిస్మస్‌ పర్వదినాన్ని పురస్కరించుకుని మంథనిలోని సీయోను ప్రార్థనా మందిరంలో పేద పాస్టర్లకు అనురాగ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఇంటర్‌నేషనల్‌ మిషన్స్‌ ఇండియా కోశాధికారి అంకరి కుమార్‌, పాస్టర్లు అజ్మీరా దయరాజు, మంథని మార్క్‌, కలవల కుమార్‌, బెంజిమెన్‌, గద్దల రాజేశ్‌, మంథని ప్రసాద్‌, అందె రమేశ్‌ పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ విజయవంతం చేయండి



ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న భద్రయ్య గురుస్వామి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం క్యాంప్‌ కార్యాలయంలో ఎమ్మెల్యే రాజ్‌ ఠాకూర్‌ మక్కాన్‌ సింగ్‌ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప మహా పడి పూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు భద్రయ్య గురుస్వామి తెలిపారు. పడిపూజను విజయవంతం చేయాలని ఫర్టిలైజర్‌సిటీ అయ్యప్ప ఆలయంలో ఫ్లెక్సీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కర్నె అశోక్‌శర్మ, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

దత్తాత్రేయ జయంతికి తరలిరండి



మాట్లాడుతున్న కార్పొరేటర్‌ శివకుమార్‌

గోదావరిఖనిటౌన్‌: ఆలయ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 26న స్థానిక ఎల్‌బీనగర్‌లో దత్తాత్రేయ జయంతి ఘనంగా నిర్వహించనున్నట్లు కార్పొరేటర్‌ అయిత శివకుమార్‌ ఆదివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదానం ఉంటుందని వివరించారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



సాయం అందిస్తున్న స్నేహితులు

సుల్తానాబాద్‌రూరల్‌: సుల్తానాబాద్‌ మండలం మంచరామి గ్రామానికి చెందిన బుత్కురి శ్రీనివాస్‌ ఇటీవల మృతిచెందాడు. ఆతడితో పదో తరగతి వరకు చదువుకున్న స్నేహితులు శ్రీనివాస్‌ కుటుంబానికి సాయం చేశారు. ఆయన కూతురి పేరిట రూ.60,000 పోస్టాఫీసులో ఫిక్స్‌డ్‌ డిపాజిట్‌ చేశారు.



పెద్దపల్లి జిల్లాకేంద్రంలో విద్యుత్‌ దీపాలతో చర్చి



ముస్తాబైన యైటింక్లయిన్‌ కాలనీలోని సెయింట్‌ జాన్స్‌ చర్చి



పెద్దపల్లి జిల్లాకేంద్రంలో..



గోదావరిఖనిలో వేడుకలకు చర్చి రెడీ

క్రిస్మస్‌కు ముస్తాబు

నేటి క్రిస్మస్‌ వేడుకకు జిల్లావ్యాప్తంగా చర్చిలు ముస్తాబు అయ్యాయి. విద్యుత్‌ దీపాలతో వెలుగులు విరాజిమ్ముతున్నాయి. గోదావరిఖని రాజీవ్‌నగర్‌లోని లెమెన్స్‌ ఇవాంజికల్‌ ఫెలోషిప్‌ చర్చిని కలర్‌ఫుల్‌ లైటింగ్‌లతో ముస్తాబు చేశారు. యైటింక్లయిన్‌కాలనీలోని సీఎస్‌ఐ సెయింట్‌ జాన్స్‌ చర్చి, పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని పలు చర్చిలు, మంథనిలోనూ ఏసు మందిరాలు రెడీ అయ్యాయి. సుల్తానాబాద్‌లోని గొల్లపల్లి చర్చిని ప్రార్థనలకు సిద్ధం చేశారు. జూలపల్లి ఐపీసీ చర్చి, జేఎల్‌ఎం చర్చి, వడ్కాపూర్‌, కుమ్మరికుంట, పెద్దాపూర్‌, ఎలిగేడు మండలంలోని ధూళికట్ట, ర్యాకలదేవుపల్లి, ఎలిగేడు తదితర గ్రామాల్లోని చర్చిలను క్రిస్టియన్లు వేడుకలకు ముస్తాబు చేశారు. – సాక్షి, నెట్‌వర్క్‌

డబుల్‌ రోడ్డుపై ఆశలు!

- ప్రమాదకరంగా కమాన్‌పూర్‌–గోదావరిఖని సింగిల్‌ రోడ్డు
- అడుగుకో గుంత.. కమ్మేసిన చెట్ల పొదలు
- ప్రయాణికులపై ఐదు కిలోమీటర్ల అదనపు దూరభారం
- డబుల్‌ రోడ్డు వేయాలని కోరుతున్న ప్రజలు
- నూతన సర్కారుపైనే ఆశలు



గుంతలమయంగా మారిన కమాన్‌పూర్‌- గోదావరిఖని సింగిల్‌ రోడ్డు

కమాన్‌పూర్‌: కమాన్‌పూర్‌ నుంచి గోదావరిఖనికి డబుల్‌ రోడ్డు ఉండాలన్నది మండలవాసుల ఏళ్ల నాటి కల. డబుల్‌ రోడ్డు వేస్తే దూరభారం తగ్గుతుందని, ఇప్పుడున్న సింగిల్‌ రోడ్డుతో నరకయాతన అనుభవిస్తున్నామని ఇక్కడి ప్రజలు, ప్రయాణికులు చెబుతున్నారు. కమాన్‌పూర్‌ నుంచి పెంచికల్‌పేట మీదుగా గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. అడుగుకో గుంతతో ప్రమాదకరంగా తయారైంది. ఈ విషయమై గత ప్రభుత్వం దృష్టికి పలుమార్లు సమస్యను తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం, నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు చొరవ చూపాలని మండలవాసులు కోరుతున్నారు.

ఇదీ సమస్య..

కమాన్‌పూర్‌ మండలకేంద్రంలోని శ్రీపాదరావు విగ్రహం నుంచి పెంచికల్‌పేట సమీపంలోని సింగరేణి కోల్‌కారిడార్‌ రోడ్డు వరకు ఆరు కిలోమీటర్ల సింగిల్‌ తారురోడ్డు ఉంది. ఈ రహదారి అడుగుకో గుంతతో అధ్వానంగా ఉండడంతో పాటు చెట్ల పొదలు కమ్ముకోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఫలితంగా గోదావరిఖని నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు యైటింక్లయిన్‌కాలనీ, ఓసీపీ–1, జూలపల్లి మీదుగా కమాన్‌పూర్‌ చేరుకోవాల్సి వస్తోంది. ఇలా 11 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. కోల్‌కారిడార్‌ నుంచి పెంచికల్‌పేట మీదుగా కమాన్‌పూర్‌ రావాలంటే ఆరు కిలోమీటర్ల దూరం. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో కాలనీ మీదుగా ఐదు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని చెబుతున్నారు.

పెరుగుతున్న రద్దీ..

కమాన్‌పూర్‌ నుంచి పెంచికల్‌పేట మీదుగా గోదావరిఖనికి వెళ్లే రహదారిపై వాహనాల రద్దీ పెరుగుతోంది. పెద్దపల్లి నుంచి గోదావరిఖనికి వెళ్లే లారీలు, ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐకి బొగ్గు తరలించే లారీలు, ఇతర వాహనాలు బసంత్‌నగర్‌ వద్ద టోల్‌ టాక్స్‌ నుంచి తప్పించుకునేందుకు ఈ దారి గుండా ప్రయాణం చేస్తున్నారు. కాగా.. ఈ రహదారి వెంట కల్వర్టులు, కాజ్‌వేలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షంకాలంలో లో లెవల్‌ కాజ్‌వేలపై నీరు వెళ్తుండడంతో ప్రయాణానికి అడ్డంకి ఏర్పడుతోంది. ప్రస్తుతం రహదారికి ఇరువైపులా తుమ్మపొదలు కమ్ముకోవడంతో వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్‌ ప్రభుత్వం స్పందించి డబుల్‌ రోడ్డు వేసేలా చొరవ తీసుకోవాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో..?

- ప్రమాదకరంగా ఎస్సారెస్పీ కాలువ వంతెన
- భయాందోళన చెందుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని ఇంజినీరింగ్‌ అధికారులు



ప్రమాదకరంగా ఉన్న కెనాల్‌ వంతెన

ధర్మారం: ధర్మారం మండలం బంజేరుపల్లి తండా బి గ్రామంలోని ఎస్సారెస్పీ కాలువ వంతెన ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మల్లాపూర్‌ శివారులో డీ–83 ప్రధానకాలువకు మూడు దశాబ్దాల క్రితం డీ–83బీ ఉపకాలువ నిర్మించారు. ఇది మల్లాపూర్‌ నుంచి వెల్గటూర్‌ మండలంలోని పలు గ్రామాలకు విస్తరించి ఉంది. మండలంలోని బంజేరుపల్లి తండాబి వద్ద కెనాల్‌పై గతంలో వంతెన డ్రాప్‌ నిర్మించారు. ఇప్పుడిది శిథిలావస్థకు చేరింది. ఇరువైపుల రక్షణగోడలు లేకపోవడంతో పలువురు చిన్నారులు కాలువలో పడిన ఘటనలు ఉన్నాయి. పలు ద్విచక్ర వాహనదారులు సైతం రాత్రిపూట కాలువలో పడ్డారు. ఈ వంతెన మీదుగా ద్విచక్ర వాహనాలతో పాటు ధాన్యం కోసం వచ్చే లారీలు సైతం ప్రయాణం సాగిస్తుంటాయి. అయితే ఏ సమయంలో ఈ వంతెన కూలుతుందో..? ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని గ్రామస్తులతో పాటు దీనిపై నుంచి ప్రయాణం చేసేవారు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత ఇంజినీరింగ్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జికి ఇరువైపుల రక్షణగోడలు నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ నరేశ్‌ను వివరణ కోరగా డీఈఈ ఆధ్వర్యంలో వంతెన రక్షణ గోడల నిర్మాణానికి అంచనాలు వేసి, నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు వివరించారు. వంతెన శిథిలావస్థకు చేరలేదని, త్వరలోనే ఇరువైపులా రక్షణ గోడలు నిర్మిస్తామని పేర్కొన్నారు.

‘విప్లవ సంఘాల ఐక్య కూటమిని గెలిపించండి’

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికుల ఉద్యోగ భద్రత సంస్థ పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న విప్లవ కార్మిక సంఘాల ఐక్య కూటమిని గెలిపించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కృష్ణ, శ్రీనివాస్‌, రాములు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రెస్‌ భవన్‌లో మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ముందుండి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 27న నిర్వహించే సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో విప్లవ కార్మిక సంఘాల ఐక్య కూటమి చక్రంలో సుత్తి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు మల్లేశ్‌, కే.విశ్వనాథ్‌, అశోక్‌, నరేశ్‌ పాల్గొన్నారు.

అండగా ఉంటా.. సహకారం అందిస్తా



ఎమ్మెల్యే విజయరమణారావుకు మెమెంటో అందిస్తున్న ఆర్యవైశ్యులు

- ఎమ్మెల్యే విజయరమణారావు
- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం

పెద్దపల్లిరూరల్‌: ఈ విజయం మీ అందరిది. మీ సహకారం వల్లే మంచి మెజార్టీతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యా. మీకు అండగా ఉంటూ సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లిలోని ఆర్యవైశ్యభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి మెమెంటోను అందించారు. ఆర్యవైశ్యులు అగ్రవర్ణాలే అయినా, ఆర్థికంగా వెనకబడిన వారికోసం ప్రభుత్వ పరంగా సాయమందించేలా చూస్తానన్నారు. మున్సిపల్‌ పెంచిన ట్రేడ్‌ లైసెన్సు ఫీజును తగ్గిస్తానని హామీ ఇచ్చారు. సంఘ నాయకులు నాగభూషణం, వరప్రసాద్‌, రాజేందర్‌, వేణు, శ్రీనివాస్‌, అనిల్‌, జ్యోతి, రమేశ్‌ పాల్గొన్నారు.

శాలివాహన సంఘం ఏకగ్రీవం



సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్‌ గ్రామ శాలివాహన(కుమ్మరి) సంఘం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా అరికొల్ల మల్లేశ్‌, ఉపాధ్యక్షుడిగా కొరెపు సంపత్‌, ప్రధాన కార్యదర్శిగా శనిగరపు రాజు, ముఖ్య సలహాదారులుగా అరికొల్ల కొమురయ్య, కొరెపు ఓదెలును ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో శాలివాహన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జూలపల్లి: మండలంలోని నాగులపల్లె, పెద్దాపూర్‌ గ్రామాల్లో మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుష్మాన్‌ భారత్‌పై అవగాహన కల్పించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌వో కలీమొద్దీన్‌, హెచ్‌వీ వసంత, ఏఎన్‌ఎం అరుణ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉపాధిహామీ గ్రామసభలు

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో రమేశ్‌ తెలిపారు. మంగళవారం (26న) మండలంలోని రాఘవాపూర్‌, మారెడుగొండ, చీకురాయి, భోజన్నపేట, పెద్దబొంకూర్‌, కాసులపల్లి, దేవునిపల్లి, హన్మంతునిపేట, నిమ్మనపల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతర జయప్రదం చేయండి

మంథని: మహారాష్ట్రలోని సిరోంచలో నేడు జరిగే పూలే సాహు, మనస్మృతి దహనం, బుద్ధుడు, అంబేద్కర్‌ మహనీయుల జాతరను జయప్రదం చేయాలని సమతా సైనిక్‌ దళ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి కొటారి శ్రీనివాస్‌ పిలుపునిచ్చారు. ఈ జాతరను మహనీయుల వారసులు వచ్చి ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

అర్హులకు స్థలాలు కేటాయించండి

- భూ కబ్జాదారుల నుంచి స్థలాలు కాపాడండి
- కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు పోలుదాసరి కల్యాణ్‌



ఇందిరమ్మకాలనీలో మాట్లాడుతున్న కల్యాణ్‌

జ్యోతినగర్‌: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కాంగ్రెస్‌ పార్టీ నాయకుడు పోలుదాసరి కల్యాణ్‌ రెవెన్యూ అధికారులను కోరారు. రామగుండం కార్పొరేషన్‌ రెండో డివిజన్‌ ఇందిరమ్మకాలనీలో ఆదివారం ఆయన ఇళ్ల స్థలాలు పరిశీలించి మాట్లాడారు. చాలా రోజుల నుంచి ఇష్టానుసారంగా కొందరు ఇళ్ల స్థలాలు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. నిరుపేదలకు స్థలాలు లేకుండా చేయడం సమంజసం కాదని అన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం పేదలకు ఇళ్లస్థలాలతో పాటు నిర్మాణాలకు రూ.5 లక్షలు అందిస్తుందని స్పష్టం చేశారు. రామగుండం రెవెన్యూ అధికారులు కాలనీలో పర్యటించి, అక్రమంగా కబ్జా చేసిన స్థలాలను గుర్తించి పేదలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. సోమవారం కాలనీలో రెవెన్యూ అధికారులు పర్యటించనున్నట్లు స్పష్టం చేశారు.

ముగిసిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో నిర్వహించిన అంతర్‌జిల్లా అథ్లెటిక్స్‌ పోటీలు ఆదివారం ముగిశాయి. రాణించిన క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర పరిశీలకుడు రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము గట్టయ్య తెలిపారు. అండర్‌–14,16లో ఆనంది, సాయికుమార్‌, లక్ష్మణ్‌, మనోజ్ఞ, కోమలత, అభిషేక్‌, మాన్య, రోహిత్‌వర్మ, భరత్‌, సాయి తదితరులకు మెడల్స్‌ అందించారు. బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌, పీఈటీ ప్రణయ్‌, కొమురయ్య, సుదేశ్‌, అజయ్‌, రాజేందర్‌, మౌనిక పాల్గొన్నారు.

నీటి విడుదల పరిశీలన



సాగునీటిని పరిశీలిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

ముత్తారం:ముత్తారం మండలం శుక్రవారంపేట చింతల చెరువు టూ టీఎంసీ ప్రాజెక్టు నుంచి విడుదలైన సాగునీరును ఆదివారం కాంగ్రెస్‌ నాయకులు పరిశీలించారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గుండారం రిజర్వాయర్‌ నుంచి శుక్రవారంపేట రిజర్వాయర్‌ ద్వారా యాసంగి పంటకు సాగునీరు అందుతోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అదేశాల మేరకు సాగునీరు విడుదల అయిందని మాజీ జెడ్పీటీసీలు నాగినేని జగన్‌మోహన్‌రావు, చొప్పరి సదానందం, మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు. నాయకులు పంజాల కుమారస్వామి, అబ్బు శంకర్‌రెడ్డి, తాళ్లపల్లి విష్ణు, చంద్రమౌళి, ఎం.శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

ఆకుల భూమయ్యకు ఘన నివాళి



భూమయ్య విగ్రహానికి నాయకుల నివాళి

జూలపల్లి: మండలంలోని కాచాపూర్‌ గ్రామానికి చెందిన తెలంగాణ జనసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కామ్రేడ్‌ ఆకుల భూమయ్య 10వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని భూమయ్య విగ్రహానికి కుటుంబ సభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. భూమయ్య కుటుంబసభ్యులు అరుణ, చారుమతి, కవిత, సునీత, సోదరుడు చంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు అడప లక్ష్మణ్‌, అకుల రాజయ్య, శేషన్న, నర్సయ్య, సర్పంచ్‌ బంటు ఎల్లయ్య పాల్గొన్నారు.

శాంతికి మారుపేరు ఏసుక్రీస్తు



కేక్‌ కట్‌ చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్‌: శాంతికి మారుపేరు ఏసుక్రీస్తు అని సుల్తానాబాద్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ముత్యం సునీత అన్నారు. సుల్తానాబాద్‌ మున్సిపల్‌ పరిధిలోని సెయింట్‌మేరీస్‌ ఇంగ్లిష్‌ మీడియం పాఠశాలలో నిర్వహించిన ప్రీ క్రిస్మస్‌ వేడుకల్లో పాల్గొన్నారు. ఏసు జనన విధానం తెలియజేసే క్రిబ్‌ ముందు క్యాండిల్స్‌ వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫాదర్‌ అశోక్‌ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జననం ప్రపంచానికే శాంతి సందేశాన్ని అందిస్తుందన్నారు. అసిస్టెంట్‌ ఫాదర్లు ప్రభాకర్‌రెడ్డి, వినయ్‌ ముత్యం సునీతను శాలువాతో సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్‌ ఫాదర్‌ తుమ్మ అశోక్‌ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వినయ్‌ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్‌: మండలంలోని గంగారం గ్రామంలోని గరుడాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం రెండో రోజు వైభవంగా కొనసాగాయి. జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ కొంకటి మల్లారెడ్డి, ఎంపీటీసీ మానస, ఉప సర్పంచ్‌ తిరుపతి, ఆలయ కమిటీ చైర్మన్‌ ఓదెలు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. రుత్వికులు అంబరీష్‌శర్మ వేదమంత్రాలతో క్రతువు నిర్వహించారు. సోమవారం ప్రతిష్ఠించే విగ్రహాలను ధాన్యాదివాసం నిర్వహించారు.

సెన్సార్‌బోర్డు సభ్యురాలిగా హరిప్రియ



గోదావరిఖని: గోదావరిఖనికి చెందిన హరిప్రియ సెన్సార్‌బోర్డు సభ్యురాలిగా ఎంపికైంది. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్‌లు హరిప్రియను సెన్సార్‌బోర్డు సభ్యురాలిగా సిఫారసు చేశారు. స్థానిక హనుమాన్‌నగర్‌కు చెందిన జర్నలిస్ట్‌ నాయిని హరిప్రియ హైదరాబాదులోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జర్నలిజం పోస్టు గ్రాడ్యుయేషన్‌ చేశారు. పలు చానళ్లలో జర్నలిస్టుగా పనిచేశారు. హరిప్రియకు సెన్సార్‌ బోర్డు సభ్యురాలిగా నియామకం కావడంపై రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్‌ రాజ్‌ఠాగూర్‌ అభినందించారు. ఇండియన్‌ జర్నలిస్టు యూనియన్‌ జాతీయ కౌన్సిల్‌ సభ్యుడు నాయిని మధునయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తగరం శంకర్‌, జిల్లా జర్నలిస్టు యూనియన్‌ అధ్యక్షుడు ఎ.రవీందర్‌రెడ్డి, కోశాధికారి సిరిమల్ల మధు శుభాకాంక్షలు తెలిపారు.